# తాలూకాఫీసు గుమస్తా

మిగతావాళ్లందరికంటే ఆలస్యంగా, తలుపులు తాళం వేసుకోవాలని తొందరచేసే నౌఖర్ని లోపల శపిస్తూ, కార్డుబోర్డు ఫైల్లో 'అర్జంటు' ఆఫీసు కాగితాల్ని కట్టి యింటిముఖం పట్టాడు ఆంజనేయులు.

ఆంజనేయులు పదిహేడేళ్ళ క్రితం తాలూకా ఆఫీసులో గుమస్తాగా చేరాడు. ఇప్పటికీ అంతులేని సముద్రంలో ఈదుతున్నవాడిలా ఆ ఉద్యోగంతోనే కొట్టుకుంటున్నాడు.

యుద్ధకాలంలో అన్నిటి ధరలూ నూటికి నాలుగైదురెట్లు పెరిగినా అతని కివ్వబడే కరువుభత్యం నూటికి ఇరవైఅయిదన్నా లేదు.

అతను చాలా అణుకువగల సేవకుడు. (మోస్టు ఒబీడియంట్ సర్వెంట్) ఎప్పుడూ అధికారులచేత మాటపడలేదు. అన్నిటికీ ముందుజాగర్తలో ఉండేవాడు. అయినప్పటికీ అధికారులు అధికారమదంతో అతన్ని కించపర్చిన క్షణాలు లేకపోలేదు. ఆ క్షణాల్లో అతనిలో ఒకవిధమైన భావం కలిగి, మనస్సుని విచారంలో ముంచేది: "నేను బానిసని కావడంలేదు కద!" అని.

కాని అది రోజుల దొర్లుబాటుతో మనస్సులో అడుగున ఎక్కడో అణిగిపోయేది. అవును, ఇతరుల సేవలో ఉన్నపుడు ప్రతీవాడికీ అలాంటి భావం కలగడం సహజం. కాని దాన్ని వాడు ఏవేవో సమర్థనలతో మరిచిపోడానికి ప్రయత్నిస్తాడు.

ఆంజనేయులు యింటికి రాగానే బట్టలు మార్చుకుని అరుగుమీద అక్కడ చేరిన తక్కిన తోటి ఉద్యోగస్తులతోపాటు దినపత్రికను తిరగేశాడు. పత్రిక చదవడాన్ని బద్ధకంవల్లో, చత్వారంవల్లో నిషేధించుకున్న ఒక ముసలి గుమాస్తా "విశేషాలు ఏమిటని" అడుగుతే ఏమీ లేవన్నాడు ఆంజనేయులు.

అది అక్కడ సర్వసాధారణంగా జరిగే విషయమే. అతను పత్రిక చదవనిరోజూ, విశేషాలు లేదనని రోజూ లేదు. కాని ఆరోజుల్లోనే ప్రపంచయుద్ధం జరిగి ముగిసింది; జీవిత పరిమాణం ఎన్నోరెట్లు పెరిగిపోయింది; ఇండియా స్వాతంత్ర్యం వచ్చింది; పాకిస్తాన్ జన్మించింది;

నౌఖాలీలో, పంజాబ్‌లో, హైదరాబాద్‌లో హిందూ ముస్లిం సంఘర్షణలు జరిగి వేలకొలదీ జనం ధన, ప్రాణ, మానాల్ని పోగొట్టుకున్నారు. అప్పటికీ ఆంజనేయులు మాత్రం 'విశేషాలు లేవ'నని రోజులేదు.

రాత్రి ఎనిమిదిగంటలకల్లా భోజనం, అదీ ముగించుకుని దీపంముందర కూచుని 'అర్జంటు' ఆఫీసు కాగితాల విషయం చూడసాగాడు. తను ఉద్యోగం చేస్తున్న ఈ ఇన్ని సంవత్సరాలలో ఆఫీసరు 'అర్జంటు' అనని కాగితంలేదు. అతను ఇలా ఎన్నిరోజులు, ఎన్ని గంటలు ఆఫీసుపనికోసం ధారపోశాడో, అతనితోపాటు నిద్రలేకుండా పాటుపడే ఆ తుప్పుపట్టి, మసిబారిన హరికేన్ లాంతరుకీ, ఎప్పుడూ సంతోషంగా మనసిచ్చి మాట్లాడ్డానికి సావకాశంలేని 'అర్జంటు' ఆఫీసుపనికి జీవితాన్ని అంకితమిచ్చిన ఆ శ్రమజీవి అయిన భర్తని చూసుకుని మనసులో పడేవ్యధనంతటినీ మనస్సులోనే అణచుకునే అతని భార్య హృదయానికీ తెల్సు.

అంతలోకీ తహసిల్దార్ గారి నౌఖరువచ్చి వీధి గుమ్మందగ్గర "ఆంజనేయులుగారు న్నారా?" అని అరిచాడు.

గోచి సవిరించుకుంటూ వెళ్ళి వీధితలుపు తీశాడు.

"ఏం? ఎందుకూ?"

"తహసీల్దార్‌గారు రమన్నారండి"

"ఆ! ఎందుకూ, ఇప్పుడు? ఏం పని?"

"ఏమీ చెప్పలేదండి, అర్జంటుగా తీసుకురమ్మన్నారండి."

"అయితే నువ్వు నడు, నేను చొక్కా వేసుకునివస్తాను" అని ఆంజనేయులు నౌఖర్ని పంపించేశాడు.

అతనికి లోపల ఏదో భయం కలిగింది. ఇలా రాత్రివేళ ఎందుకు పిలిపిస్తాడు తహసీల్దారు? ఏమిటా అర్జంటు పని? ఏమీ పాలుపోలేదు.

ఇలా ఆలోచించుకుంటోనే బొత్తాలు లేని చొక్కా తొడుక్కుని, ఒక తువ్వాలు వేసుకుని తహసీల్దారుగారింటికి బయలుదేరాడు గుండెలు చేత బట్టుకుని.

"నమస్కారమండి" అన్నాడు ఆయన్ని చూడగానే.

"రండి, కూచోండి" అన్నాడు తహసీల్దారు లేవకుండానే. ఆయన ఆంజనేయులుకంటే చిన్న.

కూచోకుండానే ఆంజనేయులు సమాధానం చెప్పాడు: "నేను తమరు చూడమన్న ఎకౌంట్ కాగితాలు చూస్తున్నాను. ఇంకా ఏదో అర్జంటుపని అన్నారుట..."

తహసీల్దారు వచ్చేనవ్వుని లోపలకి నెట్టుకుంటూ "ముందు కూచోండి, ఇదేం ఆఫీసు కాదు. సావకాశంగా మాట్లాడుకుందాం" అన్నాడు.

ఆఫీసరు వరస చూసి ఆశ్చర్యపోతున్న ఆంజనేయులు పక్కనిఉన్న బెంచీమీద కూచుని ప్రశ్నార్థకంగా చూడసాగాడు...

"అబ్బె కబురంపింది, మరేమీ కారణంచేతకాదండీ, ఎల్లుండి నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల సమ్మెఉంది కదూ..."

"అదేమో నాకు తెలియదండి; నా అయిదుగురు పిల్లల సాక్షిగా, ఆ విషయం నేనసలు ఎరగనంటే నమ్మండి. మీరీవూరు వొచ్చినప్పటి నుంచి చూస్తున్నారుగా, నా పనేమో, నేనేమో" అన్నాడు అంజనేయులు మాట కద్దువచ్చి.

ఈసారి తహసీల్దార్ పైకే నవ్వేశాడు, అతని అమాయకత్వాని చూసి, ఆంజనేయులుకు మాత్రం ఆ నవ్వు అర్థం కాలేదు.

"మీరేం సమ్మెనాయకు లవుతున్నారని కాదు నేననేది. మీరుకూడా సమ్మెలో పాల్గొనాలని. నేనే నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లకి ఇక్కడ అధ్యక్షుణవడంవల్ల మీతో స్వయంగా చెప్పవల్సివచ్చింది"

ఆంజనేయులు పొందిన ఆశ్చర్యానికి అంతులేదు. ఏమిటి? తన ఆఫీసరు తన్నా సమ్మె చెయ్యమనడం?

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు" అన్నాడు తహసీల్దారు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

'నాకు అర్థమవడం లేదు. అందులో పిల్లలు కలవాణ్ణి."

"మరి నేను? ఉద్యోగం? ఒక విషయం ఆలోచించండి: స్వతంత్రప్రభుత్వమే మనకి సరిపోయే తిండి బట్టా యియ్యకపోతే..."

"పురుట్లోనే సంది కొట్టిస్తారా?" అన్నాడు ఆంజనేయులు చప్పున – మోస్టు ఒబీడియంట్ సర్వెంట్‌ననేమాట గుర్తుకు తెచ్చుకుని.

"మంత్రుల జీతాలు పెంచుకునేందుకు పురుడు లేదుటండీ, సెంట్రల్ గవర్నమెంట్ ప్యూనుకుండే జీతం మన గుమస్తాకి లేదూ?"

ఆంజనేయులుకు ఆఫీసరుతో వాదనకి దిగుతున్నామనే సంగతి గుర్తుకొచ్చి ఊరుకున్నాడు.

"అల్లాగే లెండి" అని లేచాడు వెళ్ళిపోడానికి "సెలవు"

"తప్పకండా పాల్గొనాలి" మళ్లీ రెట్టించాడు తహసీల్దారు.

ఇంటి కెళ్ళిపోతున్నంతసేపూ అదే ఆలోచించుకున్నాడు ఆంజనేయులు. తహసీల్దారుగారు పాల్గొనగా లేంది, అంతకంటే గొప్ప ఉద్యోగా తను?

సమ్మె ప్రారంభించిన రెండురోజులకే తహసీల్దారుని వేలూరు తీసుకుపోయారు. దీనితో అక్కడ ఉద్యోగులకి మరీ పట్టుదల వచ్చింది.

పదిహేనురోజులు సమ్మెచేశారు. తిండిక్కూడా జీతం చాలని ఉద్యోగులు. ప్రభుత్వం వాళ్ళ కోరికల్ని అర్థంచేసుకోడానికి బదులు నిర్బంధం ఉపయోగించ ప్రయత్నించింది. సాధారణంగా శ్రామికుల్లో ఉండే ధైర్యం, పట్టుదల, కట్టుబాటు ఈ మధ్యతరగతి ఉద్యోగుల్లో లేకపోవడంచేతా, కొందరు సంఘసభ్యులు మరుదోవ పట్టించడంచేతా సమ్మె అసంతృప్తికరంగా ముగిసింది.

ఆఫీసర్లు కొంతమంది ఉద్యోగుల్ని తిరిగి ప్రవేశపెట్టుకోడంలో అభ్యంతరాలు చెప్పారు.

ఆంజనేయులుకూడా ఆ తరగతిలోకే చేరాడు. తన ఆఫీసరు త్యాగం చూశాక కలిగిన ఉద్రేకంతో ఆంజనేయులు ప్రధానపాత్రధారయ్యాడు.

పనిలో చేరడానికి వచ్చిన అతన్ని 'సస్పెండ్' చేశామన్నారు కొత్తగా వచ్చిన ఆఫీసరు.

కాని అతనికెందుకో విచారం కలగలేదు. అతను చేసిన పాపం ఏమిటీ? ఇన్నాళ్ళు బ్రిటిష్‌వారి పరిపాలనలో బానిసగా బ్రతికిన అతను, స్వతంత్ర భారతదేశంలో స్వతంత్రపౌరుడిగా తను చేస్తున్న చాకిరీకి తగిన భృతి అడిగాడు. ఇన్నాళ్ళనుంచీ మూసుకుపోయిన కళ్ళని ఈవేళ విప్పుకున్నాడు! ఇదీ సత్యం!! ఇదీ అతను చేసిన పాపం!!

"ఇన్నాళ్లూ పరప్రభుత్వంమీద సహాయనిరాకరణోద్యమం నడిపిన ప్రజలు, ప్రభుత్వంలోకి వెళ్ళాక తమకు తోడ్పడిన ప్రజలకే సహాయనిరాకరణ చేస్తున్నారు" అనుకున్నాడు ఆంజనేయులు యింటికి పోతూ.

*18.07.1948–ఆనందవాణి వారపత్రిక*